# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 24 జులై, 2026 | పేజీలు :08


## కిచెన్ షెడ్ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని దరూర్ క్యాంపులోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించి, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వసతి గృహంలోని విద్యార్థులకు అనుకూలంగా ఉండే విధంగా కిచెన్ షెడ్ నిర్మాణ పనులు నాణ్యతతో, వేగవంతంగా నిర్మించాలని నిర్మాణం పనులలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.రాజ్ కుమార్, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అధికారుల విధులకు
# ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు



### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రభుత్వ అధికారులు తమ విధులను నిర్వహించే సమయంలో ఆటంకాలు కల్పించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి మండలంలోని రంగాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గంట రమేష్ ప్రభుత్వ అధికారిని విధుల నిర్వహణలో అడ్డుకోవడం, అసభ్యకర, అనుచిత పదజాలంతో దూషించడం,బెదిరింపులకు పాల్పడినట్లు సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్, ఎం.బి. ఇంట్రా,పెద్దపల్లి అందజేసిన ఫిర్యాదు మేరకు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 37(1)(ii), 37(1)(iii) ప్రకారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఫిర్యాదును ప్రాథమికంగా పరిశీలించగా, అందులో పేర్కొన్న ఆరోపణలు సంబంధిత చట్టంలోని నిబంధనల పరిధిలోకి వస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో, సంబంధిత సర్పంచ్‌కు కారణం చెప్పాలని కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.షోకాజ్ నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజులలోపు లిఖితపూర్వక సంజాయిషీని సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా సంజాయిషీ సమర్పించనట్లయితే, అందుబాటులో ఉన్న రికార్డులు, సాక్ష్యాధారాల ఆధారంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వ అధికారులు చట్టబద్ధమైన విధులను నిర్వర్తిస్తారని, వారి విధుల నిర్వహణకు ఆటంకం కల్పించడం, బెదిరించడం లేదా అనుచితంగా ప్రవర్తించడం చట్టరీత్యా తీవ్రమైన విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర గౌరవం,సమన్వయంతో ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## రైతులకు ఎల్‌నినో ప్రభావంపై
# అవగాహన కల్పించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలోని రైతులందరికీ గ్రామసభల ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం ఉదయం ఎల్‌నినో ప్రభావంపై రైతులతో గ్రామసభలు నిర్వహించడం, జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనుల గ్రౌండింగ్, పురోగతి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంపై వ్యవసాయ, పంచాయతీ రాజ్, గృహనిర్మాణ శాఖల అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా కార్యక్రమాల పురోగతిని మండలాల వారీగా తెలుసుకుని, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతు గ్రామ సభల ద్వారా జిల్లాలోని రైతులందరికీ ప్రత్యామ్నాయ పంటల సాగు, వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల, రిజర్వాయర్లలో వర్షం నీటి సంరక్షణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండల ప్రత్యేక అధికారి వారానికి కనీసం రెండు గ్రామసభలకు హాజరై రైతులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, ఆయా పంటలకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, డీఏఓ అఫ్జల్ బేగం, ఎంపీడీఓ లు, మండల వ్యవసాయ అధికారులు, హౌసింగ్ డీఈ, ఏఈ లు, ఏపీఓలు, పాల్గొన్నారు.

# పంటలకు బీమా లేదు..రైతుకు ధీమా లేదాయె!

- ఖరీఫ్‌లో వర్షాల్లేక, విత్తనాలు మొలకెత్తక రైతులకు తీవ్ర నష్టం
- నాలుగు సీజన్లు గడుస్తున్నా అమలకు నోచుకోని పంటల బీమా
- ఆదుకోవాలని రైతులు, రైతు స్వరాజ్య వేదిక డిమాండ్

**ప్రజాపక్షం/నేరడిగొండ:** దేశానికి అన్నం పెట్టే అన్నదాలు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అందే వరకు ఆందోళన తప్పడం లేదు. అతివృష్టి లేకపోతే అనావృష్టితో ప్రతి సంవత్సరం రైతులు కష్టాలు ఎదుర్కొంటూనే ఉన్నారు. కన్నబిడ్డలా సాకిన పంట ఇంటికి వచ్చే వరకు భరోసా లేని పరిస్థితి నెలకొంది. శక్తికి మించి పెట్టుబడులు పెడుతున్న రైతులకు చివరకు అప్పులే మిగులుతున్నాయి.

**అటకెక్కిన ఫసల్ బీమా యోజన**

కేంద్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్ ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన' పథకం కింద ప్రతి సంవత్సరం జులై 15లోపు పంటల బీమా నమోదు చేసుకునే అవకాశం ఉండేది. కానీ 2020 నుంచి రాష్ట్రంలో ఈ పథకాన్ని గత ప్రభుత్వం నిలిపివేసింది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో పంటలు దెబ్బతింటే ఆర్థికంగా ఆదుకునే ఈ బీమా పథకం ప్రస్తుతం అందుబాటులో లేకుండా పోయింది.

**నెరవేరని కాంగ్రెస్ హామీ**

తాము అధికారంలోకి వస్తే అన్ని పంటలకు బీమా పథకం అమలు చేస్తామని, ఎకరాకు పరిహారం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి మూడు సీజన్లు పూర్తయి నాలుగో సీజన్ వస్తున్నా ఇప్పటి వరకు పంటల బీమా అమలుపై ఎలాంటీ చర్యలు తీసుకోలేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పడక విత్తనాలు మొలకెత్తక జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పెట్టిన పెట్టుబడులు రాక, ప్రభుత్వం నుంచి సహాయం అందక, బీమా వర్తించక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

**తక్షణమే బీమా పథకాన్ని అమలు చేయాలి**

ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ఆరుగాలం కష్టపడే రైతులకు మేలు చేసేలా ఉండాలని, అన్ని విధాలా అండగా నిలవాలని రైతులు అంకుష్, బాపూజీ, రమణ, నారాయణ, సురేందర్‌రెడ్డి కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా పంటల భీమా పథకాన్ని అమలు చేసి, తీవ్ర నష్టాల్లో ఉన్న రైతులకు ఆర్థిక భరోసా కల్పలించాలని రైతు స్వారాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద బస్సులు ఆపాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద బస్సుల్లో ఆపాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య అన్నారు. గురువారం రోజున గోదావరిఖని, మంథని డిపో మేనేజర్లు శ్రవణ్ కుమార్,కవిత లకు బస్సులు ఆపాలని వినతిపత్రం సమర్పించారు. వినతి పత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల జూన్ 10 తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ & పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు పెద్దపల్లి పట్టణంలోని1,2,3, 21వ వార్డులు శాంతినగర్ లో రిక్వెస్ట్ బస్ స్టాప్ ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందని అయినప్పటికీ అక్కడ బస్సుల్లో ఆపకపోవడంతో వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, శాంతినగర్ లో శ్రీ కోదండ రామాలయం,సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉండడం వలన నిత్యం ప్రయాణికులు సందడి ఉంటుందని పెద్దపల్లి నుండి హైదరాబాద్ వరకు హైదరాబాద్ నుండి పెద్దపల్లి వచ్చే ప్రయాణికులు రాత్రి పూట పెద్దపల్లి బస్టాండ్ నుండి శాంతినగర్ వైపు కాలినడకన వచ్చే ప్రయాణికుల నుండి బంగారు ఆభరణాలు చోరికి గురవుతున్నాయని అందువల్ల శాంతినగర్ రిక్వెస్ట్ బస్



స్టాప్ వద్ద బస్సులు ఆపాలని డిపో మేనేజర్లకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్లు మాట్లాడుతూ రేపటి నుండి బస్సు డ్రైవర్ల అందరికి శాంతినగర్ రిక్వెస్ట్ బస్సు స్టాప్ వద్ద బస్సులు ఆపే విధంగా సూచనలు చేస్తామని అన్నారు.

## ప్రజలకు నాణ్యమైన తాగునీటి సౌకర్యాలు కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని 12వ వార్డు (అర్బన్ కాలనీ)లో బోరు బావి నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీటి సౌకర్యాలు కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరిచే అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, 11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్, 13వ వార్డు కౌన్సిలర్ గుడికందుల అజయ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, డీఈ నాగేశ్వర్ రావు,కాంగ్రెస్ నాయకులు ముఖీం, పట్టణ ఆర్యవైశ్య సంఘం రాంబాబు, నాయకులు, కోట కిరణ్, ఎల్మి రవి, మహిళలు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపికి చిత్తశుద్ధి ఉంటే ఎంపి నిధులతో రోడ్డు వేయించాలి

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని 11వ వార్డు అభివృద్ధిపై బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను స్థానిక యువత తీవ్రంగా ఖండించారు. బీజేపీ నాయకులకు నిజంగా అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే, ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక నిధుల ద్వారా వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్పై తమకు పూర్తి నమ్మకం ఉందని స్థానిక యువకులు తెలిపారు. ఆయన నిత్యం ప్రజల్లో ఉంటూ వార్డు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.తమ వార్డులో బీజేపీ నాయకులు వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేయడం సరికాదని విమర్శించారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లకు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన సమయం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రత్యేక శిక్షణ తరగతులకు తరలిన మున్సిపల్ కౌన్సిలర్లు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** శిక్షణ తరగతులకు మున్సిపల్ కౌన్సిలర్లు హైదరాబాద్ కు తరలి వెళ్లారు. గురువారం సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత తో పాటు 13 మంది కౌన్సిలర్లు హైదరాబాద్ కు బయలుదేరి వెళ్లారు.ట్రైనింగ్ కౌన్సిలర్లకు శిక్షణ తరగతులు గచ్చిబౌలిలో నీ నేషనల్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ హాల్లో ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ వార్డ్ మెంబర్స్ ఆఫ్ మున్సిపాలిటీ అండ్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్ తెలంగాణ ప్రోగ్రాంలో పాల్గొన్నట్లు కౌన్సిలర్ తెలిపారు.

## బురద రోడ్డుతో ఇబ్బందులు..!

**ప్రజాపక్షం/ముత్తారం:** తమ గ్రామానికి ఉన్న ప్రధాన రహదారి కాస్తా బురదమయంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.నిత్యం రాకపోకలు సాగించే పాఠశాల విద్యార్థులు,వృద్ధులు,వాహనదారులు ఈ దారిలో ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. మాక్కు ఈ బురద రోడ్డు ఇబ్బందులు ఎప్పుడు తప్పుతాయి? అంటూ.. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామస్తులు, వాహనదారులు అధికారులను, ప్రజాప్రతినిధులను సూటిగా ప్రశ్నిస్తున్నారు.మరీ ముఖ్యంగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయానికి సమీపంలోనే ఈ రోడ్డు ఉండడం,రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడం గమనార్హం.దీనివల్ల ఆ ప్రాంతంలో విపరీతంగా దోమలు చేరి, అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రాణాంతకంగా మారే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



స్పందించని పాలకులు : సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా ఇటు అధికారులు కానీ, అటు ప్రజాప్రతినిధులు కానీ కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామం రోగాల బారిన పడక ముందే,ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ బురద రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా దారి మైసమ్మ తల్లికి మొక్కులు

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేషనపల్లి గ్రామంలో దారి మైసమ్మ తల్లి మొక్కుల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.గ్రామ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో



ఈ వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాక్టర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆనవాయితీగా గ్రామ శివారులోని దారి మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు.తమ వాహనాలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా,డ్రైవర్లు, ఓనర్లు అందరూ నిరంతరం క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.కేవలం వాహనదారులే కాకుండా,ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషంగా వర్ధిల్లాలని కోరుకుంటూ అమ్మవారికి మేక పోతులను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నామని వెల్లడించారు.భక్తిభావంతో సాగిన ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యూనియన్ డ్రైవర్లు,యజమానులు,స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దారి మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

## తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో కెటిఆర్ ముద్ర చిరస్మరణీయం

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** తెలంగాణ రాష్ట్ర సాధనలో,రాష్ట్ర భవిష్యత్తును టెక్నికల్ మరియు పారిశ్రామిక రంగాలలో అగ్రగామిగా నిలపడంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చేసిన కృషి చిరస్మరణీయమని టీవీ స్టీవీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ కొనియాడారు.కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారం ముందస్తు వేడుకలను గులాబీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి.ఈ సందర్భంగా డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి,వారికి స్వయంగా పండ్లు,బ్రెడ్లను పంపిణీ చేశారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో పరిపూర్ణమైన జీవితాన్ని గడపాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ జూలై 24న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నీట్ వ్యతిరేక ఉద్యమంలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి నిరసనగా తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్దపల్లి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు,విద్యార్థి విభాగం మరియు యువత పెద్దఎత్తున తరలి వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలోనే ఒకరోజు ముందే పెద్దపల్లిలో కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వ



హించినట్లు తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండి రోడ్లపై ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యమని,కేంద్రంలో నీట్ పేపర్ లీకేజీకి కారణమైన బీజేపీ,ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల వద్ద దిష్టిబొమ్మలు దహనం చేయడం,నిరసనలు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు.గ్రూప్1 ఇంటర్వ్యూలకు పిలిచిన 3,200 మందికి పైగా అభ్యర్థుల వివరాలు ఇప్పటివరకు వెల్లడించకపోవడం,అలాగే నీట్ పీజీ పరీక్షల్లో జీరో మార్కులు వచ్చిన వారికి కూడా వాలిడిటీ ఇస్తూ సీట్లు కేటాయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్లు బిక్షపతి,స్వామి,ఉపసర్పంచ్ మేకల కుమార్ యాదవ్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి, పడాల సతీష్ గౌడ్,బింగి రాజు,మేడుదుల రాజ్ కుమార్,ఉప్పు శివ కుమార్,బోయిని మనోజ్,వెంకటేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## ఏఎల్పి గనిలో ప్రమాదం కాంటాక్ట్ కార్మికుడి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/రామగిరి :** పెద్దపల్లి జిల్లాలోని ఏ. పీ.,ఏ డివిజన్ ఏఎల్పి గనిలో గురువారం జరిగిన ప్రమాదంలో వెన్సర్ కంపెనీ కంపెనీకి చెందిన కాంటాక్ట్ కార్మికుడు గుంట. మల్లేష్ (33)తీవ్రంగా గాయపడ్డాడు గనిలో 3 సిమ్ పనులుచేస్తూ రూఫ్ బోల్ట్ ఏర్పాటు చేస్తున్న సమయంలో యంత్రానికి సంబంధించిన బీట్ విరిగి మల్లేష్ తలపై పడడంతో ప్రమాదం చోటుచేసుకుంది ప్రమాదంలో గాయపడిన మల్లేశ్ శంసుప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు ఇతని పరిస్థితి విషమంగా ఉంది ప్రమాదానికి గల కారణాలపై సింగరేణి అధికారులు విచారణ చేపట్టారు.

## జలసిరి పనులు వేగవంతం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జలసిరి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో చిప్ప.గణేష్ అన్నారు.ఈ సందర్భంగాజగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జలసిరి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించి,ప్రతి గ్రామంలో నాలుగు ఫారం పాండ్లు, ప్రతి వీవోఏ పరిధిలో మూడు వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణానికి లబ్ధిదారులను వెంటనే గుర్తించాలని అధికారులకు సూచించారు.గ్రామపంచాయతీ తీర్మానాలతో కూడిన ప్రతిపాదనలను ఈరోజు సమర్పించాలని ఎంపీడీవో ఆదేశించారు.ఈ సమావేశంలో ఎంపీవో రాజు, ఏవో ఆకు రాజ్ కుమార్, ఏపీవో, ఏపీఎం, ఐకేపీ వీవోఏలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అత్యవసర రక్తదానంతో మహిళ ప్రాణాలను కాపాడిన శ్రీకాంత్

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వర్షకొండ గ్రామానికి చెందిన మల్లు అనే మహిళకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ దృష్టికి తీసుకెళ్లగా,ఆయన వెంటనే బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి,సామాజిక సేవకుడు కలికోట శ్రీకాంత్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన కలికోట శ్రీకాంత్ బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేసి మహిళకు అవసరమైన రక్తాన్ని అందించారు. ఆయన సకాలంలో చేసిన రక్తదానం వల్ల బాధిత మహిళకు అత్యవసర చికిత్స అందించేందుకు అవకాశం లభించింది. దీంతో ఆయన మరోసారి సామాజిక సేవలో తన నిబద్ధతను చాటుకున్నారు.ఈ సందర్భంగా రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచిన కలికోట శ్రీకాంత్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్, పార్టీ కార్యవర్గ సభ్యులు, శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుడు డా. రవి, రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్, బాధిత మహిళ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని,ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

## రైతులు ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు.ధర్మపురి రైతు వేదికలో గురువారం ధర్మపురి డివిజన్ లోని వివిధ మండలాల వ్యవసాయాధికారులు,విస్తరణాధికారులతో ఎల్ నినో ప్రభావం,ఆరుతడి పంటల ప్రణాళికపై జిల్లా వ్యవసాయ అధికారి నేతృత్వంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలైన కంది,మొక్కజొన్న, పెసర,మినుము,జొన్న,వేరుశనగ వంటి ఆరుతడి పంటలు సాగుచేసేలా రైతులను చైతన్యపరచాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆత్మ డీపీడి జాన్ సుధాకర్,ధర్మపురి ఏడిఏ రాంచందర్, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలి: ఎస్‌పి అశోక్ కుమార్

**ప్రజాపక్షం /పెగడపల్లి :** వార్షిక తనిఖీల్లో భాగంగా జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు,రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు,జనరల్ డైరీ, ఆర్మ్ రూమ్, స్టోర్స్, లాకప్ రూమ్‌లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి,విచారణలో ఉన్న కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పోలీసు విధులు ప్రజలకు



మరింత చేరువగా ఉండాలని అన్నారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచడంతో పాటు సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లతో పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో నమోదైన వివరాలను పరిశీలించారు. రిసెప్షనిస్ట్‌గా ప్రతి దరఖాస్తుపై పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో జనరేట్ చేసిన రసీదును తప్పనిసరిగా ఫిర్యాదుదారులకు అందించాలని సూచించారు.

## విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మరింత మెరుగు పడాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రభుత్వ విద్యాలయాల్లోని విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మరింత మెరుగు పడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా విద్యాశాఖ అధికారి మొండయ్య, కో ఆర్డినేటర్లతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ)లో భాగంగా జిల్లాకు వివిధ అంశాల్లో వచ్చిన గ్రేడింగ్, పాయింట్స్ తదితర విషయాలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మరింత మెరుగు పడేలా ఒక ప్రణాళిక రూపొందించాలని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ తదితర పాఠ్యాంశాల్లో ప్రతిభ చూపేలా, విద్యార్థులు అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పేలా, రాసేలా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా విద్యాధికారి తమ పరిధిలోని మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ ఎంలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ ఎంలు షెడ్యూల్ ప్రకారం తమ పరిధిలోని అన్ని విద్యాలయాల్లో తనిఖీ చేసి.. ఆ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. టీచర్ల ట్రైనింగ్ వివరాలు, అన్ని విద్యాలయాల్లో కంప్యూటర్లు, ట్యాబ్ లు, ఇంటర్నెట్ కనెక్షన్, ఐ ఎఫ్ బీ ప్యానెల్స్, టాయిలెట్స్, తరగతి గదులు, మైదానం, ఇతర మౌలిక సదుపాయాల పూర్తి సమాచారాన్ని ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో మెరుగైన స్థానంలో ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, కో ఆర్డినేటర్లు తదితరులు ఉన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** కేసీఆర్ ఉచిత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గురువారం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం సిరిసిల్లలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కేటీఆర్ ఆదేశాలతో ప్రజలకు ఈ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని మండల అధ్యక్షులు గుజ్జుల రాజిరెడ్డి తెలిపారు.

## కొత్త పాలకవర్గంపై విమర్శలు సిగ్గుచేటు

### యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంట ప్రణయ్ తేజ

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** కొత్తగా ఏర్పడిన మున్సిపల్ పాలకవర్గంపై కక్షపూరిత విమర్శలు చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంట ప్రణయ్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీజేపీ నాయకులు మట్టి రోడ్డులో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేయడం హేయమైన చర్య అని ఆయన విమర్శించారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, స్థానిక ఎంపీ ధర్మపురి అరవింద్ మెట్‌పల్లి పట్టణానికి ఎంత మేర నిధులు తీసుకొచ్చారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో పట్టణ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చొర



వతో మెట్‌పల్లి పట్టణ అభివృద్ధికి రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇటీవల బీజేపీకి చెందిన కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 14వ వార్డులో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు.మున్సిపల్ చైర్మన్ ప్రజా సమస్యలపై పూర్తి అవగాహనతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని,రానున్న రోజుల్లో పట్టణంలోని ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

## తాత జ్ఞాపకార్థం...గ్రామపంచాయతీకి బాడీ ఫ్రీజర్ వితరణ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్న పేట గ్రామంలో అనేక సంవత్సరాలుగా ,బాడీ ఫ్రీజర్ లేకపోవడం వల్ల గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు పార్థివ దేహాలను భద్ర పరచుకోవడానికి పడుతున్న ఇబ్బందులను గమనించి యూత్ నాయకుడు ఆవారి చందు ఈ విషయాన్ని సామాజిక సేవకులు ఎడమల భోజేందర్ రెడ్డి కి తెలపగా స్పందించిన భోజేందర్ రెడ్డి తన తాత ఎడమల ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం మల్లన్న పేట,శంకర్రావుపేట ,వెంగలాపూర్ ,నందిపల్లి గ్రామాల సౌకర్యార్థం కొరకు సుమారు రూ.60 వేల వ్యయంతో కొనుగోలు చేసిన ఈ ఫ్రీజర్ ను గురువారం మల్లన్న పేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఇతర ప్రజా ప్రతినిధుల సమక్షంలో అందజేశారు .ఆయా గ్రామాల వారికి అవసర రీత్యా బాడీ ఫ్రీజర్ ను వాడుకోవాలని సామాజిక సేవకులు భోజేందర్ రెడ్డి తెలిపారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం పై మకారంతో తాత జ్ఞాపకార్థం భోజేందర్ రెడ్డి చేసిన ఈ సహాయం మరువ




లేనిదని కొనియాడారు .తోటి వారికి ఉపయోగ పడేలా ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిద్ధెంకి లక్ష్మి మల్లారెడ్డి ,శంకర్ రావు పెట్ సర్పంచ్ గోలి గంగారెడ్డి,వెంగళాపూర్ సర్పంచ్ రామ్ రెడ్డి ,శంకర్ రావు పెట్ ఉప సర్పంచ్ రంజిత్ రెడ్డి ,మాజీ ఎంపీటీసీ భీమ సత్యం,గాదం లింగన్న,గట్ల సత్యం,గాదం గంగన్న,గాజుల తిరుపతి, ఉల్లెంగుల మొగిలి,గుగ్గిళ్ళ నరేష్,భోగ తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీ లో ఘనంగా స్వాగతోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** ట్రినిటీ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 2026–2027 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అమ్మాయిలకు (రాజశ్రీ గార్డెన్స్ ), అబ్బాయిలకు (శుభం గార్డెన్స్ ) వేరు వేరుగా ప్రైవేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ ఛైర్మన్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. సమావేశాలకు విశిష్ట అతిథులుగా జగిత్యాల జిల్లా డిప్యూటీ కలెక్టర్, ట్రినిటీ పూర్వ విద్యార్థి కుమారి కన్నం హరిణి, మరో ఇద్దరు పూర్వ విద్యార్థులు, వేములవాడ ఎంపిడీవో బింగి కీర్తన, పెద్దపల్లి ఎంపిడీవో సందేవేణి ప్రియాంక ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కళాశాల ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన ఉన్నతమైన విద్యను అందించడానికి మారుమూల ప్రాంతమైన పెద్దపల్లిలో



1984 లో 70 మంది విద్యార్థులతో ట్రినిటీ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. అంచెలంచలుగా ఎదుగుతూ రాష్ట్ర రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకరావడం జరిగిందన్నారు. ఎస్సెస్సీ తరువాత ఇంటర్ విద్య కొరకు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గుంటూరు, నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి దూర ప్రదేశాలకు వలస వెళ్లే వారిని, వాటి నుండి తల్లిదండ్రులను రక్షించడానికి కరీంనగర్ లో 1998లో 300 విద్యార్థులతో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ అక్రమం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య సంతోష్ నాయక్



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో నీట్ విద్యార్థులపై లాఠీచార్జి, రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతుందని, ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులను అరెస్ట్‌లు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట ఎస్‌ఐ బదిలీ

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట్ ఎస్.ఐ గా విధులు నిర్వహిస్తున్న రాహుల్ రెడ్డి ని ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్ కి అటాచ్ చేస్తూ గురువారం రోజున ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మీడియా ప్రకటన విడుదల చేసినట్లు సమాచారం.

## నీట్ విద్యార్థులపై లాఠీ ఛార్జీ చేయడం అమానుషం

### రాహుల్ గాంధీ అరెస్ట్ అక్రమం

**ప్రజాపక్షం/ ఎల్లారెడ్డిపేట :** డిల్లీలో శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న నీట్ విద్యార్థులపై లాఠీ ఛార్జీ చేయడం అమానుషం అని ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిద రాజేందర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్ లో గురువారం నీట్ విద్యార్థులపై లాఠీచార్జి, రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిద రాజేందర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సయ్య ,షేక్ సాహెబ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దత్తాత్రేయ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ గౌస్ మర్రి శ్రీనివాస్ రెడ్డి గుండాడి రాంరెడ్డి బందారి బాల్రెడ్డిలు , మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతుందని అన్నారు. 25 లక్షల మంది నీట్ విద్యార్థులు పరీక్ష రాస్తే పేపర్ లీక్ చేసి రెండవసారి నిర్వహించడం జరిగిందన్నారు. నీట్ పరీక్ష కేవలం 20 లక్షల మంది విద్యార్థులు మాత్రమే పరీక్ష రాశారన్నారు. విద్యార్థుల్లో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, విద్యార్థుల మరణాల పాపాలు ఎవరికి తగులుతాయని ప్రశ్నించారు. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని భర్త రఫ్ చేయాలని ఎఐసిసి నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేసిన న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సాబేరా బేగం, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, , గంట బుచ్చగౌడ్ , నంది కిషన్, సిరిపురం మహేందర్ అనవేని రవి, తిరుపతి గౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జెడ్పిహెచ్ఎస్ ఎల్లారెడ్డిపేట విద్యార్థుల చేనుచెలక సందర్శన

**ప్రజా పక్షం/ ఎల్లారెడ్డిపేట :** రైతులు పడే కష్టం, వ్యవసాయం ప్రాముఖ్యతపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేట ఆరో తరగతి విద్యార్థులను స్థానిక పొలాల సందర్శనకు (ఫీల్డ్ విజిట్) తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల మనోహరచారి తెలిపారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు పొలాల్లో పనిచేస్తున్న రైతులను కలిసి, పైరు పెంపకం, నీటి యాజమాన్యం, పంటల సాగులో ఎదురయ్యే సవాళ్లను నేరుగా అడిగి తెలుసుకున్నారు. మనం తినే అన్నం వెనుక రైతన్నలు ఎంతగా కష్టపడతారో విద్యార్థులు ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు.

# రైతులు 100% లక్ష్యాన్ని చేరుకోవాలి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** రైతులు 100% లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ అధ్యక్షతన జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలలో ఎల్నినో ప్రభావంతో రైతులు నీటి కుంటలు,ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, ప్రతి గ్రామానికి రెండు చొప్పున నీటి కుంటలు 100 శాతం రాయితి పైన ఉపాధి హామీ పథకములో ఇవ్వడం జరుగుతుంది జిల్లాలోని ఉద్యాన రైతులు ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలతోటల సన్న, చిన్నకారు రైతులు నీటి కుంటలు తప్పకొని నీటిని సద్వినియోగం చేసుకోవాలని, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు ప్రతి ఒక్కరు 100 శాతం లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి పైడి తల్లి, మండల్ ఇరిగేషన్ అధికారులు ఏపీఓ, ఎంపీఓ మౌనిక , పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన విస్తరణ అధికారులు పాల్గొన్నారు

## ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/జమ్మికుంట :** బిజెపి చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో బిజెపి నాయకులు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేసే ప్రయత్నం చేశారు. స్థానిక గాంధీచౌక్ నుంచి బస్టాండ్ మీదుగా ఫ్లైఓవర్ వరకు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బిజెపి ఆందోళన చేపట్టి రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేసే ప్రయత్నం చేయగా ఇంతలోనే పోలీసులకు బిజెపి నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఎస్సై రమేశ్ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ తీసుకొని పరుగెత్తడం ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. కార్యక్రమాల పేరుతో విద్యార్థుల ముసుగులో ఉన్న సంఘ విద్రోహులను ప్రోత్సహిస్తూ విదేశాల నుంచి వస్తున్న సొమ్ముతో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టి బంగ్లాదేశ్ నేపాల్, శ్రీలంక దేశాల పరిస్థితి భారత దేశంలో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు జీడి మల్లేశ్, రాజేశ్ ఠాకూర్, కేలాసకోటి గణేశ్, అడువాల శ్రీధర్, పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా లోని ప్రధానోపాధ్యాయుల మూడురోజుల ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ ప్రతి విద్యార్థి నిర్దేశిత లెర్నింగ్ అవుట్‌కమ్స్ సాధించేలా హెచ్ఎమ్‌లు, రెమిడియలు తరగతులు నిర్వాహించాలన్నారు. ముఖ్యంగా చదవడం రాయడం విమర్శనాత్మక ఆలోచన సమస్య పరిష్కార నైపుణ్యాలు కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేలా బోధన కొనసాగించాలని తెలిపారు.అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రిమీడియల్ తరగతులు నిర్వహించడం ద్వారా అవసరమైన విద్యా సహాయాన్ని అందించాలని, ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో అవసరమైన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హె ఎం లు పాల్గొన్నారు.

## 'సర్' ప్రత్యేక సవరణ ప్రక్రియలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లిలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 'సర్ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ గురువారం పాల్గొని 'సర్' ఫారాన్ని స్వయంగా నింపి, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి కుటుంబం తమ ఇంటికి వచ్చే బూత్ లెవల్ అధికారులకు బిఎల్ఓలు అవసరమైన పత్రాలు, వివరాలను అందజేసి 'సర్' ఎన్యూమరేషన్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని ప్రజలను కోరారు.అదేవిధంగా ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ఒకసారి పరిశీలించి, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సవరించుకోవాలని సూచించారు.అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి ఎల్ ఓ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆకుల ప్రవీణ్,జియా,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎఐవైఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవఎన్నిక

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా అధ్యక్షులు గా ఆసాల నవీన్, ప్రధాన కార్యదర్శిగా ఆరెపల్లి మానస్ కుమార్,ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి సురేందర్,సహాయ కార్యదర్శిగా మాచర్ల అంజి, కోశాధికారి గా ఖాజా, వీరితో పాటు 25 మందితో కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని ఉద్దేశించి వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో యువజన సంఘాన్ని ప్రతి గ్రామంలో బలోపేతం చేసి యువజన హక్కుల సాధన కోసం యువతను కదిలించాలని,గ్రామ గ్రామాన యువజన సంఘాన్ని నిర్మించి రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీల సాధన కోసం, నిరుద్యోగ భృతి,ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం యువతను చైతన్యపరిచి పోరాటాల వైపు తీసుకురావాలని ఆయన అన్నారు .అలాగే నీట్ పేపర్ లీకేజీ కుంభకోణం వలన 21 మంది అమాయక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ ఆత్మహత్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లనే వరుసగా జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన పరీక్షల పేపర్లు లీకేజీలు అవుతున్నాయని, విద్యార్థులు నష్టపోతున్న ఇప్పటివరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు.కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని గత కొన్ని రోజులుగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థి యువత పట్ల కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. శాంతియుతంగా జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థి యువతపై విచక్షణరహితంగా కేంద్ర ప్రభుత్వం పోలీసులచే లాఠీ చార్జీలు,భాష్ప వాయుగోళాలు, వాటర్ కెనాన్లు ప్రయోగించి ఇష్టానురీతంగా దాడులు చేసి తీవ్రంగా గాయపరచడం జరిగిందని అన్నారు.విద్యార్థి యువతపైదాడికి పాల్పడిన పోలీసులపై విచారణ చేసి సస్పెండ్ చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆరెపల్లి మానస్ కుమార్.ఆసాల నవీన్,మాచర్ల అంజి,తాళ్లపల్లి సురేందర్. ఖాజా,చంద్రగిరి ఉదయ్,కల్లేపల్లి నవీన్,తుంగ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## విలాసాగర్ గ్రామంలో భూ భారతి రీ సర్వే గ్రామసభ

**ప్రజాపక్షం/జమ్మికుంట:** మండలంలోని విలాసాగర్ గ్రామంలో భూ భారతి రీ సర్వే గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి జల కుమారి మాట్లాడుతూ గ్రామంలో భూభారతి రీ సర్వేపై ఏలాంటి అనుమానాలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. భూభారతి కార్యక్రమం వల్ల సమస్యలు ఉన్న ప్రజలకు మేలు జరుగుతుందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సంచాలకులు, భూమి కొలతల విభాగం కిషన్ రావు, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జమ్మికుంట, తహసీల్దార్ గడ్డం సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ ఏ.శంకర్, గిర్దవార్ ఎన్.శంకర్, జిపివో భాను ప్రసన్న, చందర్, రాజు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ శ్రీధర్, ఉప సర్పంచ్ ఆరెల్లి దివ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐయిత రాజుపల్లిలో 100% ఎస్ఐఆర్ పూర్తి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మండలంలోని ఐత రాజు పల్లి గ్రామంలో 100% ఎస్ ఐ ఆర్ పూర్తి అయినట్లు సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీలో బీ ఎల్ ఓ లు శ్రీలత, మాధవి లను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ఇచ్చిన సమయం కంటే ముందే పూర్తి చేయడంతో తమ గ్రామంలో పూర్తిగా ఓటర్ల జాబితా పూర్తయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి మధుసూదన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సృజన భాస్కర్ రెడ్డి,రమణా చారితో పాటు పలువురు పాల్గొన్నారు.

## కరీంనగర్ కమిషనరేట్‌ను సందర్శించిన డిఐజి సన్‌ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/కరీంనగర్:** మల్టీ జోన్–2 (జోన్–3) డిఐజి సన్‌ప్రీత్ సింగ్ గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనరేట్‌కు విచ్చేసిన డిఐజికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా, ఇటీవల కరీంనగర్ లోని భగత్ నగర్‌లో మంగళవారం రాత్రి ఒక ఇంటిలో జరిగిన డెకాయిటీ (దోపిడీ) ఘటనపై డిఐజి తీవ్రంగా స్పందించారు. ఈ కేసు పురోగతికి సంబంధించి సీపీ గౌష్ ఆలంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దోపిడీకి పాల్పడిన నిందితులను ఎంతటి వారైనా వదలకుండా, త్వరలోనే పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఐజి కార్యాలయ సూపరింటెండెంట్ కౌసల్య, సీసీ వేణులతో పాటు ఇతర పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజేందర్ రెడ్డి మృతదేహాన్ని పోలీసుల బందోబస్తు నడుమ గుండ్లపల్లికి తరలింపు

**ప్రజాపక్షం/గన్నేరువరం:** గన్నేరువరం మండలం గుండ్లపల్లి మాజీ సర్పంచ్ బేతల్లి సమత భర్త రాజేందర్ రెడ్డి గత పది రోజుల క్రితం ఆత్మహత్యయత్నం చేయగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా గురువారం మృతదేహాన్ని పోలీసు బందోబస్తు మధ్య గ్రామానికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత శవాన్ని బంధువులకు అప్పగించగా మృతికి కారకులైన ఎమ్మెల్యే పిఏ మురళీధర్ రెడ్డి తో పాటు మరో నలుగురు నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి వద్ద బంధువులు ఆందోళన చేపట్టగా పోలీసుల హామీ మేరకు శాంతించి మృత దేహాన్ని బందోబస్తు మధ్య గుండ్లపల్లి గ్రామానికి చేరుస్తున్న క్రమంలో రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజి వద్ద మృతుని భార్య బంధువులు రోడ్డుపై బైఠాయించి న్యాయం చేసే వరకు కదిలేది లేదని భీష్మించుకుని కూర్చోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. మార్గమధ్యలో మృతుని బంధువులు ఒక్కసారిగా పిఏ మురళీధర్ రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా మృతుని భార్య సమత మాట్లాడుతూ మృతదేహాన్ని ఇంటికి చేర్చిన ప్పటికీ, పోలీసుల హామీ మేరకు న్యాయం చేయాలని, పీఏ మురళితో పాటు నిందితులను అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించకపోతే కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## మానకొండూర్‌లో కాంగ్రెస్ ధర్నా

**ప్రజాపక్షం/మానకొండూర్ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మానకొండూర్ నియోజకవర్గం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పల్లె స్టేజ్ వద్ద ధర్నా చేపట్టి తమ నిరసన తెలిపారు. నీట్ పేపర్ లీక్‌పై ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో ఓదెలు యాదవ్, తిరుమల్ రెడ్డి,నాగిశెట్టి రాజయ్య, కిషన్ రావు,వీరాస్వామి, కనుకయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా తాళ్లపల్లి సంపత్ గౌడ్

**ప్రజాపక్షం/మానకొండూర్ :** నియోజకవర్గంలోని శంకరపట్నం, మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్ నియమితులయ్యారు. తాళ్లపల్లి సంపత్ గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో మండల ప్రధాన కార్యదర్శిగా, బీసీ సెల్ మండల అధ్యక్షునిగా, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించారు. ఈ అవకాశం కల్పించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సంపత్ గౌడ్. తనపై పార్టీ బాధ్యలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఎంపిడిఓ అంజత్ పాషా

**ప్రజాపక్షం / కెరమెరి :** ఉపాధి హామీ పథకం పనులను వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఎంపిడిఓ అంజత్ పాషా అధికారులకు సూచించారు. కెరమెరి ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గుంతల తవ్వకం, మొక్కలు నాటే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూగర్భ జలాల పునర్భరణ చెరువుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని భూగర్భ జల మట్టాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఉపాధి హామీ సహాయ ప్రాజెక్టు అధికారి మల్లయ్య, సాంకేతిక సహాయకులు అఖ్యా నాయక్, రవీందర్, దరం సింగ్, పంచాయతీ కార్యదర్శులు సతీష్ రావు, ప్రశాంత్, ఈశ్వర్, రాజు, శ్వేత, అక్షయ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే రోజు నాలుగు ప్రసవాలు

డాక్టర్ మలీడు ఉదయ్ కిరణ్

**ప్రజాపక్షం / జైనూర్ :** సిర్పూర్ (యూ) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఒకే రోజు నాలుగు సురక్షిత ప్రసవాలు జరిగినట్లు మండల వైద్య అధికారి లెఫ్టినెంట్ కమాండర్ డాక్టర్ మలీడు ఉదయ్ కిరణ్ తెలిపారు. నాలుగు ప్రసవాల్లోనూ తల్లులు, శిశువులు ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నారని వెల్లడించారు. గిరిజన ప్రాంత ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య పరికరాల వసతులు కల్పిస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. విజయవంతంగా ప్రసవాలు నిర్వహించిన ఫీల్డ్, క్లినికల్ సిబ్బందిని ఆయన అభినందించారు.

## రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** వేల్పూర్ మండల అధ్యక్షులు బేల్దారి నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. ఈ విషయంపై అధ్యక్షులు నవీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తృణముల్ కాంగ్రెస్ పార్టీ, ఆప్ పార్టీ అనే దేశ ద్రోహ పార్టీలు కలిసి ఢిల్లీలోని అన్ని వీధుల్లో అల్లర్లు సృష్టించాలని భావించి రెండు రోజుల క్రితం సిజెపి అని దేశద్రోహి పార్టీతో కలిసి నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్ జరిపారని బీజేపీపై బురద చల్లాలని భావించి విద్యార్థులను కాకుండా రోహింగ్యాలను దేశ ద్రోహులను గుమిగూడి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల దీక్ష అని దొంగనాటకమాడి బీజేపీ పై మోడీపై బురద చల్లి దేశ ఖ్యాతిని ప్రపంచంలో చిన్నగా చేయాలని ప్రయత్నించటం అమానుషం దాన్ని తిప్పికొడుతూ అక్కడున్న వారంతా విద్యార్థులు కాదని దేశ ద్రోహులేనని గుర్తించి వారికి సరైన బుద్ధి చెప్పారు.

# కాంగ్రెస్ నేతల నిరసన ర్యాలీ ధర్నా

**ప్రజాపక్షం / రామడుగు :** ఏఐసిసి అగ్ర నాయకులు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితర సీనియర్ నాయకులు నీట్ పరీక్ష లీకేజీపై విద్యార్థులకు మద్ధతుగా ఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోడీ నివాసం వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న తమ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మండల కాంగ్రెస్ నేతలు గురువారం మండల కేంద్రంలో శాంతియుత వాతావరణంలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణరహితంగా దాడి చేసి టియర్ గ్యాస్ ప్రయోగించి ఇష్టానుసారంగా ప్రవర్తించిన బిజెపి కేంద్ర ప్రభుత్వ తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఈ నిరసనలు ఆగవని, నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించేలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం, సర్పంచులు దావ అనంతరెడ్డి, మెయిజ్ నాయకులు అంజనీ ప్రసాద్, వెన్న రాజమల్లయ్య, పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు గునుగొండ అశోక్, కాడె శంకర్, అనుపురం పరశురాం గౌడ్ తోపాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ తాజా మాజీ డైరెక్టర్లు, గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## హాజీపూర్ ఎంపిడిఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం / హాజీపూర్ :** హాజీపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని గ్రామ పంచాయతీల పనితీరు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఎంపిడిఓ, ఎంపిఓలతో సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, జలసిరి పనులను గడువులోగా పూర్తి చేసి రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు.



## లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలి

జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు

**ప్రజాపక్షం / జైనూర్ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా తమ పదవులకు రాజీనామా చేయాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జైనూర్ మండల కేంద్రంలో గురువారం మాజీ వైస్ ఎంపిపి షేక్ రషీద్ నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నీట్ పరీక్షను పారదర్శకంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. లీకేజీ వ్యవహారం వల్ల ఇప్పటివరకు 12 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం దారుణమన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశ్నపత్రాలను ఐదు నుంచి పది లక్షల రూపాయిలకు విక్రయించినట్లు సిబిఐ దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయాలని ఆందోళన చేపట్టిన విద్యార్థులపై లాఠీఛార్జీకి పాల్పడటం దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ దుర్గం మహేందర్

**ప్రజాపక్షం / వాంకిడి :** రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వాంకిడి ఎస్ఐ దుర్గం మహేందర్ సూచించారు. వాంకిడి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఆయన ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరవాణి, సామాజిక మాధ్యమాలు, అంతర్జాలం ఉపయోగించే ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్, సీవీవీ వంటి రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలు, బహుమతులు, కేవైసీ నవీకరణ పేరిట వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు, పెట్టుబడుల పేరుతో అధిక లాభాల ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా మోసపోతే వెంటనే 1930 ఉచిత సహాయతా సంఖ్యకు సమాచారం అందించాలని, సమీప పోలీస్ స్టేషన్ లో లేదా జాతీయ సైబర్ నేరాల పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పేపర్ లీకేజీలపై కాంగ్రెస్ నిరసన

**ప్రజాపక్షం/మావల:** నీట్, జేఈఈ పేపర్ల లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మావల మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుదురుపాక సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పాలనలో పేపర్ లీకేజీల వల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్యాల కరుణాకర్, ధర్మపురి చంద్రశేఖర్, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొత్తపెల్లి అడెల్లు, అయిండ్ల రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా భూ సర్వే సేవలు అందించాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ:** భూసమస్యల పరిష్కారానికి పారదర్శకమైన సర్వే సేవలు అందించాలని అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 13 మంది అభ్యర్థులకు ల్యాండ్ సర్వే లైసెన్స్ పత్రాలను అందజేశారు.వివాదాలకు తావులేకుండా ఖచ్చితత్వంతో సర్వేలు నిర్వహించాలని తెలిపారు. ఎంపికైన వారిలో నేరడిగొండ మండలానికి చెందిన ఆడే మహిపాల్, ఆడే సాయికిరణ్, రాథోడ్ సందీప్ ఉన్నారు. సర్వే శాఖ ఏడీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ సర్వేను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం / వాంకిడి :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సర్వేను ప్రజలందరూ విజయవంతం చేయాలని సరండి గ్రామ పటేల్, బిఎల్ఓ కొట్రాంగే మేంఘజి కోరారు. వాంకిడి మండలంలోని సరండి గ్రామంలో వీధులు, కాలనీల్లో పర్యటిస్తూ ఎస్ఐఆర్ సర్వే ప్రాముఖ్యతపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు ఉండేలా చూసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువత కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే పేరు ఉన్నవారు తమ వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. ఇంటింటికీ వచ్చే ఎన్నికల సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించి ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, సర్వే ద్వారా ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందుతుందని పేర్కొన్నారు.గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

సర్పంచ్ మొహర్లే బాపూజీ

**ప్రజాపక్షం /వాంకిడి :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా పెంచినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని సరాండి గ్రామ సర్పంచ్ మొహర్లే బాపూజీ అన్నారు. వాంకిడి మండలం సరాండి గ్రామపంచాయతీలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామ నర్సరీ నుంచి ఇంటింటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జాడి సోనంతో కలిసి ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కనూ బాధ్యతగా సంరక్షించాలని గ్రామస్థులకు సూచించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు రమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, రాజ్‌కుమార్, ఉపాధ్యాయురాలు శిరీష, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వరి రైతులకు క్లీన్ రైస్ పంపిణీ

**ప్రజాపక్షం / సిర్పూర్-టి :** సిర్పూర్‌టి మండలంలో వరి రైతులకు క్లీన్ రైస్ బయోస్టిములెంట్ పంపిణీ చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సమన్వయకర్త డాక్టర్ మధు రైతులకు క్లీన్ రైస్ వినియోగ విధానం, దానివల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. క్లీన్ రైస్ వాడకంతో వరి నారు మొక్కలు ప్రధాన పొలంలో త్వరగా, ఆరోగ్యంగా నాటుకుంటాయని తెలిపారు. మొక్కలు పోషకాలను సులభంగా గ్రహించి బలంగా పెరుగుతాయని వివరించారు. ఎండలు, ఉష్ణోగ్రత మార్పుల వంటి ఒత్తిడి వాతావరణాన్ని తట్టుకుని ఎక్కువ పిలకలు ఏర్పడటంతో దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు.ఏడీఏ జె. మనోహర్, మండల వ్యవసాయ అధికారి బి. గిరిషన్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## కిష్టాపూర్ గ్రామ అభివృద్ధి దిశగా మరో అడుగు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలోని గ్రామ అభివృద్ధికి మండల అధికా రులు ఎంపీడీవో రామకృష్ణ ఈసీ అనిల్ సర్పంచ్ దోమల భోజన్న మరియు గ్రామస్తులు భాటలు వేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజగ్గా ర్ & అజివికా మిషన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చేయడం జరిగిందని ఇందులో భాగంగా నూతన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణం కుంట సుదర్శన్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ నిర్మాణం గ్రామ సమైక్య సంఘం భవనం వద్ద స్వచ్ఛ భారత్ మిషన్ కమ్యూనిటీ సానిటరీ సెంటర్ పనులకు ఈరోజు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను,వివో అధ్యక్షురాలు ప్రణీత,మహేష్ గౌడ్, పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసన.. సోన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతిపత్రం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ సోన్ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మొయినుద్దీన్ నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,మాజీ విప్ ఆరేపల్లి మోహన్ ఎంబడి రాజేశ్వర్ పాల్గొన్నారు.అనంతరం సోన్ తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించి అరెస్టును ఖండించారు. కార్యక్రమంలో , సర్పంచ్ కృష్ణ ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వినోద్, బండి లింగన్న, వడ్నాల రాజేశ్వర్,రాజా నరసింహా రెడ్డి,జగన్,కాంతయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 6 గొర్రెలు మృతి

### గత నెలలో 16 గొర్రెలు చనిపోగా మొత్తం 22 గొర్రెలు నష్టం

**ప్రజాపక్షం/మామడ :** మామడ మండల కేంద్రం లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది.గత నెలలో మెకం అబ్బి గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 16 గొర్రెలు చంపగా,మళ్ళీ నిన్న అదే మందలోని 6 గొర్రెలపై దాడి చేసి చంపివేశాయి.ఈ సంఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ పందిరి చంద్రకళ సురేందర్, ఉప సర్పంచ్ ప్రవీణ్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో కుక్కల సమస్య చాలా ఎక్కువగా ఉంది. రైతుల పశువులకు, ప్రజలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు.. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారం చూపిస్తాము. ఎహెచ్ మున్సిపల్ అధికారులతో మాట్లాడి కుక్కలకు ఎసిబి కార్యక్రమం చేపట్టిస్తాము అని తెలిపారు.బాధితుడు మెకం అబ్బి తనకు జరిగిన నష్టానికి ప్రభుత్వం నుండి తగిన పరిహారం అందించాలని కోరారు.



## సింగరేణి అధికారులకు వినతి పత్రాలు అందజేసిన ఎఐటియుసి

**ప్రజాపక్షం/రామగిరి :** గురువారం ఆర్జీ3 ఏరియాలోని సింగరేణి కార్మికుల సమస్యలపై ఆయా గనుల సింగరేణి అధికారులకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ వినతి పత్రాలు అందజేశారు.తధానంతరం వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు పరీక్షల్లో పారదర్శకత పాటించాలని, కార్మికులకు న్యాయం జరిగే విధంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని,అన్యాయమైన ఇన్వాలిడేషన్ నిర్ణయాలను పునఃసమీక్షించాలని యాజమాన్యాన్ని కోరారు.ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డులో 20% ఇన్వాలిడేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ,పాత పద్ధతి విధానం లాగా 80% ఇన్వాలిడేషన్ చేయాలనీ బోర్డు కు ఎక్కువ సంఖ్యలో కార్మికులను పిలవాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జీ3 ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డిటి.రావు ఓసిపి1 ప్రాజెక్ట్, ఓసిపి2, ఎఎల్పిమైన్, సిహెచ్ పి అన్ని గనుల పిట్ కార్యదర్శిలు,ఈ.గంగాధర్ ,సురేష్ ,జీ.శ్రీనివాస్,అసిస్టెంట్ పిట్ కార్యదర్శులు,జియం కమిటీ సభ్యులు,వర్క్ మెన్ ఇన్స్పెక్టర్, సేఫ్టీవర్క్ కమిటీ మెంబర్స్, క్యాంటీన్ టెంపుల్ కమిటీ మెంబర్స్,కార్మికులు పాల్గొన్నారు.



## జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జగన్నాథుడు కొలువైన పూరి పట్టణంలో మాదిరిగానే మన ఇందూరు నగరంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షులు రామానంద రాయ్ గౌరదాస్ అన్నారు. ఈనెల 24 న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నీలకంఠేశ్వర ఆలయం నుండి శ్రీరామ గార్డెన్ వరకు అంగరంగ వైభవంగా ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందని కేంద్రంలో గురువారం మధ్యాహ్నం నిర్వహించిన రథయాత్ర సన్నాహాక సమావేశంలో అధ్యక్షులు రామానంద రాయ్ గౌరదాస్ తెలిపారు. ఈ రథయాత్ర శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద మధ్యాహ్నం ప్రారంభమై రైల్వేకమాన్, గణేష్‌చౌక్, రైల్వేస్టేషన్, బస్టాండ్, గాంధీచౌక్, పెద్దబజార్, శివాజీచౌక్, పూలాంగ్ చౌరస్తా మీదుగా ఎల్లమ్మగుట్ట కమాన్, కోర్టు చౌరస్తా నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా కొనసాగుతుందన్నారు. జగన్నాథుడి రథనాఇ్న లాగడంతో సమస్త జన్మంతరాలలో చేసిన పాపాలు పరిహారం కావటమే కాకుండా విశేషమైన పుణ్యం, స్వామి అనుగ్రహం లభిస్తాయని ఎంతోమంది గురువులు తెలిపారు. కావున పెద్దసంఖ్యలో ప్రజలు ఈ రథయాత్ర మహోత్సవానికి హాజరై ఇందూరు నగర పురవీధుల గుండా సాగే రథయాత్రను విజయవంతం చేయాలని స్వామి అనుగ్రహానికి పాత్రులు కావలని సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాము. సమావేశంలో రామానందరాయ్ గౌరదాస్, గంగారెడ్డి ప్రభు, మాదాసు స్వామి యాదవ్, రఘుపతి, రాధరాజు, గోపికేశదాస్, బలరాంప్రభు, సునీల్, ప్రభు రోహిత్ ప్రభు, నవరూప ముకుంద దాస్ పాల్గొన్నారు.



## ఫార్మ్ పాండ్, ఇంకుడు గుంతల నిర్మాణాలకు స్థల సేకరణ

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** మండల పరిధిలోని నూతన లోలం గ్రామంలో మంగళవారం ఫార్మ్ పాండ్ (పంట కుంట), సామూహిక (కమ్యూనిటీ) మరియు వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాలకు సంబంధించిన స్థల సేకరణ మరియు గుర్తు పరిచే (మార్క్ అవుట్) కార్యక్రమాన్ని నిర్వహించారు.స్థానిక సర్పంచ్,ఉపసర్పంచ్ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ఫార్మ్ పాండ్లు మరియు భూగర్భ జల మట్టాన్ని పెంపొందించడానికి ఇంకుడు గుంతల నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. రైతులు, గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి (ఎంపిఒ), గోవర్ధన్,అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఎపిఒ), దివ్య రెడ్డి. వ్యవసాయ అధికారి (ఎఒ), రాజశేఖర్ రెడ్డి.అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఎపిఎం), బోస్, గ్రామ సర్పంచ్ శ్రీలత ,ఉప సర్పంచ్ బండారి ముత్యం వార్డు సభ్యులు (బివిజిఆర్ఎఎంజి) సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ సమావేశం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ అధ్యక్షతన జూలై మాసపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ అంకం మౌనిక మహేందర్ మాట్లాడుతూ, ఖానాపూర్ పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కౌన్సిల్ సభ్యులు చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు.సమావేశంలో పట్టణ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు అంశాలపై సభ్యులు చర్చించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్, కౌన్సిలర్లు గొర్రె తిరుమల గంగాధర్,తాళ్లపల్లి రాజగంగన్న,సాజియా బేగం జమాల్,గుమ్ముల ఆనంద్ కుమార్, మేష పోసాని, నిమ్మల రమేష్, చిన్నం సత్యనారాయణ,తొడసం ఇందిరా,మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపాలిటీ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## పిసిసి అధ్యక్షుడికి వినతి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మండల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు కలిసి మండలంలోని పలు ప్రజాసమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో పెండింగ్‌లోని తహసీల్దార్ కార్యాలయం, నిర్మాణం, రహదారుల దుస్థితి, మినీ స్టేడియం నిర్మాణం, వంద పడకల ఆస్పత్రి పనుల పురోగతి తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వినతిని స్వీకరించిన పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సమస్యలపై సానుకూలంగా స్పందించారు. భీమ్‌గల్‌లో నిర్మాణంలోని 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరగా మంజూరు చేసి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు అరిగెల జనార్ధన్, ఉపాధ్యక్షులు రమేష్, దేవేందర్, వసంత్, వసుంధర్, అజయ్, అశోక్, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు అంజుమ్, సతీష్, సందీప్, సంగ్యానాయక్, మహేష్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

## 'ఎల్‌నినో' ప్రభావంపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతులకు ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించినట్లు మండల వ్యవసాయాధికారిని రమ్యశ్రీ తెలిపారు. ముఖ్యంగా నీటి అవసరం తక్కువగా ఉండే పప్పు దినుసులు, మినుములు, సజ్జలు వంటి చిరుధాన్యాలు ప్రత్యామ్నాయ పంటలుగా సాగు చేయాలని సూచంచారు. సర్పంచ్ కొత్తపల్లి హారిక, ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్, కార్యదర్శి వినోద్, రైతులు పాల్గొన్నారు.

## ఇందూరు కవులకు దాశరథి పురస్కారం

### దాశరథి జయంతి వేడుకల్లో మందారం సౌగంధిక స్వయంవరం పుస్తకాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఇందూరు కవులు దారం గంగాధర్, తోగర్ల సురేష్‌లకు దాశరథి పురస్కారం అందుకున్నారు. గురువారం నగరంలోని బాపూజీ వచనాలయంలో ఘనంగా నిర్వహించిన సాహిత్య సభలో ఇద్దరు కవులు రచనలైన 'మందారం', 'సౌగంధిక స్వయంవరం' పుస్తకాలను ఆవిష్కరించారు. మహాకవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యుల 101 వ జయంతి వేడుకల సందర్భంగా ఇందూరుకు చెందిన ప్రముఖ కవులు, రచయితలు దారం గంగాధర్, తోగర్ల సురేష్ లకు ప్రతిష్టాత్మక దాశరథి పురస్కారం ప్రదానం చేశారు. ఈ కారయక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ భుజంగరావు దారం గంగాధర్ రచించిన మందారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాల శ్రీనివాస్ మూర్తి తోగర్ల సురేష్ రచించిన సౌగంధిక స్వయంవరం గ్రంథాన్ని ఆవిష్కరించారు. కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొని పురస్కార గ్రహీతలను అభినందించారు.

## దివ్య నగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణం లోని దివ్య నగర్ కాలనీ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా కోరిపల్లి రామ్ కిషన్ రెడ్డి,అధ్యక్షులుగా పురస్తు శంకర్,ఉపాధ్యక్షులుగా జి. శ్రీనివాసచారి,కృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీగా సరసాని మహేందర్ రెడ్డి,కోశాధికారిగా ఇర్రి నరేందర్ రెడ్డి,సంయుక్త కార్యదర్శి గా జి. రాకేష్ రెడ్డి,జి. అంబాజీ, కార్యవర్గ సభ్యులుగా జుట్టు లక్ష్మణ్, పత్తిరెడ్డి సుదర్శన్ రెడ్డి,అంగ రవి, ధర్మగడ్డ కృష్ణ కుమార్,రాచమల్ల రాజన్న,సుధార్ సింగ్, సలహాదారులుగా రాథోడ్ రాందాస్,కొంద్రు సురేష్, ముసుకు సతీష్ రెడ్డి, ఏలేటి విజయభాస్కర్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు.తమపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు కాలనీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నూతన జనరేటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన జనరేటర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాథోడ్ రమేష్ గురువారం ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు.విద్యుత్ అంతరాయాల సమయంలో కూడా కలెక్టరేట్‌లోని కార్యాలయాల పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నూతన జనరేటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వని మోదీ ప్రభుత్వం

**కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదు**

**ఉభయసభల్లో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై చర్చ జరగాల్సిందే**

**విద్యార్థులపై లాఠీ చార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి**

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి డిమాండ్**



**ప్రజాపక్షం/బోథ్ :** ప్రస్తుతం వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఉభయ సభల్లో నీట్ లీకేజీ వ్యవహారంపై, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు జరుగుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పేర్కొన్నారు.ఏఐసీసీ, పీసీసీ పిలుపుమేరకు బోథ్ మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమంలో, విద్యార్థులు ఏర్పాటు చేసిన మానవహారంలో మాట్లాడుతూ చట్టాలు చేసే పార్లమెంట్లో చర్చలకు బిజెపి ప్రభుత్వం రాకపోవడం వల్లనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇంటివద్ద నిరసన తెలుపవలసిన అవసరం ఏర్పడిందని, ఈ నిరసన కార్యక్రమాలు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసింతవరకుకొనసాగుతాయని, తెలిపారు.జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు యువకులవద్దఉద్దేశపూర్వకంగా బిజెపి నాయకులు చొరబడి హింసకు ప్రేరేపిస్తున్నారని, భద్రత బలగాలను అవహేళన చేస్తున్నానని , విద్యార్థి ఉద్యమాన్ని నేరుగారిచే ప్రయత్నం చేస్తున్నాయని తెలియజేశారు.దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మాణం అవుతుంటే బిజెపి ప్రభుత్వ హయాంలో పార్లమెంట్లో అపహాస్యం అవుతుందని రానున్న రోజుల్లో తప్పకుండా దీనికి భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించారుఈ కార్యక్రమంలో బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు బోజన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, ఏ.ఐ.టి.యు.సి .జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ బోత్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు, డిసిసి సెక్రటరీ ఎల్మ వినయ్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురుమే మహేందర్, ఉప సర్పంచ్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుద్దుల అరుణ్ కుమార్ రెడ్డి, బోథ్ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, సీనియర్ వార్డ్ మెంబర్ షేక్ షాకీర్, రైతు నాయకులు యాళ్ల ఇంద్రారెడ్డి, రహీముద్దీన్, చమేందర్ రెడ్డి,షేక్ అబుద్,సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ ఎంపిటిసి చట్ల ఉమేష్, భీమ బుచ్చన్న,వోటర్ కర్ రాజశేఖర్, సాయన్న,ప్రభాకర్, కౌసర్,శంషుద్దీన్, గంగయ్య, యూసుఫ్, సన్నీ రెడ్డి,మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు నరసింహ,దాసు,విద్యార్థులు, పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ విద్యార్థులపై అమానుష దాడులపై నిరసన



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్తా గౌడ్ మరియు మండల నాయకులు ఎమ్మార్వో కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఏఐసీసీ ఆదేశాల మేరకు మరియు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌరవనీయులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మరియు నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు గౌరవనీయులు ఖానాపూర్ శాసనసభ్యులు యువ నాయకులు వెడ్మ భోజ్జు పటేల్ గ ఆదేశానుసారం నీట్ పేపర్ లీకేజీ పేపర్ పై ధర్నా చేపట్టడం జరిగిందని తెలిపారు. నాయకులు రత్నాకర్ రావు,భుజంగరావు పటేల్,కపిల్ సాయి ప్రసాద్,గంగాధర్ గంగయ్య,సాయా రెడ్డి,నరసయ్య,హర్ష ప్రసాద్,తదితర మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వరి నారుమడిని పరిశీలించిన రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

**ప్రజా పక్షం/దిలావర్ పూర్ :** దిలావర్ పూర్ మండలంలోని బన్స పల్లి గ్రామంలో నాబార్డ్ మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) బంసపల్లి చేపట్టిన విత్తనోత్పత్తి కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన రైతు గంగిరెడ్డికి కూనారం 1638 రకం వరి విత్తనాలను అందజేశారు.ఈ నేపథ్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీ రాహుల్ విశ్వకర్మ రైతు యొక్క వరి నారుమడిని క్షేత్రస్థాయిలో సందర్శించి,పరిశీలన జరిపారు.ప్రస్తుతం వరి నారుమడి 15 నుండి 18 రోజుల వయస్సులో ఉందని,నారు బలంగా ఎదుగడానికి అగ్రిమిన్ మాక్సను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్త సూచించారు. అదేవిధంగా నారుమడి దశలో చీడపీడలు ఆశించకుండా ఉండటానికి ఎకరానికి సరిపడే నారుమడిలో 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3G గుళికలను చల్లుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు గంగిరెడ్డితో పాటు స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## విమర్శలకు స్వస్తి చెప్పి, నిర్మల్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

**ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్**




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రతిపక్షాలపై రాజకీయ విమర్శలు చేయడం మానుకొని, నిర్మల్ పట్టణ సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఎఏపి) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రశ్నాపత్రాల లీకేజీలకు నిరసనగా తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలో విద్యా వ్యవస్థ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని,విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.సోషల్ మీడియా, ప్రెస్ మీట్లలో సమయం వృథా చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలోని సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని సయ్యద్ హైదర్ విమర్శించారు. నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ కాలనీ, మహాలక్ష్మి వాడల్లో కనీస మురుగునీటి డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేక వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసరమైన సీటీ స్కాన్ (సిటిఎస్) సౌకర్యం లేక పేద ప్రజలు ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. జిల్లాలో కొత్త పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు.వైఎస్సార్ కాలనీ, మహాలక్ష్మి వాడల మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ ఆసుపత్రిలో సీటీ స్కాన్ సదుపాయం తక్షణమే అందుబాటులోకి తీసుకురాకపోతే, స్థానిక బాధితులతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నిర్మల్ మున్సిపాలిటీ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

## 'సర్' కార్యక్రమంపై బోథ్ ఎంఆర్ఓతో కాంగ్రెస్ నాయకుల సమీక్ష



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ ఎం.ఆర్.ఓ.సుభాష్ చంద్ర తో బోథ్ మండల కన్వీనర్ మేరుగు భోజన్న,ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి,బిఎల్ఎ2 సూపర్వైజర్ ఎస్కే మొహమ్మద్, షేక్ అబూద్,అచ్యుత్ రెడ్డి, రహీముద్దీన్ సమావేశమై బోథ్ మండలం, బోథ్ నియోజకవర్గంలో కొనసాగుతున్న సర్ కార్యక్రమం పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా యం.ఆర్.ఓ సుభాష్ చంద్ర మాట్లాడుతూ, బోథ్ మండలంలో సర్ కార్యక్రమం నేటి గురువారం తో 100% పూర్తవుతుందని, బోథ్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలో 5వ స్థానంలో కొనసాగుతుండటం ఆనందకర విషయమని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన అధికారులు, సిబ్బంది,బీఎల్ఓలు,బీఎల్ఏ2లు ప్రజాప్రతినిధులందరికీ అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పరామర్శ

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలం సోమరిపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రాజేశ్వర్ సతీమణి రాజమణి అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ గురువారం జిల్లా కేంద్రం నిర్మల్‌లో గల దేవేందర్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు.ఈ సందర్భంగా రాజమణి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను సమాచారం అడిగి తెలుసుకుని,మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.అనంతరం బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు.

## గుండంపల్లిలో జలసిరి కార్యక్రమం.. ఫారం పాండ్‌కు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు శంకుస్థాపన



**ప్రజా పక్షం /దిలావర్‌పూర్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో ఫారం పాండ్ నిర్మాణ పనులకు నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు గురువారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ ముందుకు వచ్చి తమ పంట పొలాల్లోని ప్రతిగా ఫారం పాండ్‌లను(నీటి కుంట) నిర్మించుకోవాలని సూచించారు.వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు లబ్ధి చేకూరుతుందని, సాగు అవసరాలకు వినియోగించుకోవచ్చని అన్నారు.ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున భూగర్భ జలాలు అడుగంటితే పంటలు పండే అవకాశం ఉండదని రైతులు ముందుగానే ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులందరినీ భాగస్వాములను చేయాలని మండల అధికారులను ఆదేశించారు.గుండంపల్లి గ్రామానికి విచ్చేసిన అదనపు కలెక్టర్‌కు గ్రామ సర్పంచ్ తక్కల రమణా రెడ్డి, ఉపసర్పంచ్ విలాస్ శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ రాణి, ఎంపీఓ గోవర్ధన్, ఏవో రాజశేఖర్ రెడ్డి, ఏపీఓ దివ్య రెడ్డి,టీఏ వెంకట్ రామ్, ఫీల్డ్ అసిస్టెంట్ బలరాం తదితర అధికారులు,సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎల్‌ఎ కాంపోనెంట్ మహాగాం

**జిల్లావిద్యాధికారి దర్శనం భోజన్న సందర్శన**

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలను జిల్లావిద్యాధికారి గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుదలను తెలుసుకొని ప్రధానోపాధ్యాయుడు యన్ కృష్ణ ను సన్మానించడం జరిగింది.ఈ క్రమం లో పాఠశాలలో అమలు అవుతున్న ఎఫ్ ఎల్ యన్ కు సంబంధించి బేస్ లైన్ టెస్ట్ ను అబ్జర్వ్ చేయడం జరిగింది.అలాగే పిల్లల విద్యా ప్రమాణాలు తెలుసుకొని తగు సూచనలు చేయడం జరిగింది.పాఠశాలలో ఉన్న న్యూట్రిషన్ గార్డెన్ ను చూసి ఆనందం వ్యక్తం చేయడం జరిగింది.పాఠశాల న్యూట్రిషన్ గార్డెన్‌లో మొక్కను నాటడం జరిగింది.జిల్లా విద్యాధికారి వెంట కుబీర్ మండల విద్యాధికారి శ్రీ విజయ్ కుమార్,మహాగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యన్ కనక రాజు, మహాగాం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యన్ కృష్ణ,ఉపాధ్యాయులు హరీష్,రాగిణి,విద్యార్థులు ఉన్నారు.



# ప్రధాని మోదీ రాజీనామా చేయాలి



ప్రజాపక్షం /మెట్‌పల్లి : నీట్ పరీక్ష ప్రశ్న పత్రం లీక్ ఘటనతో పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డా. బెజ్జారపు శ్రీనివాస్ అన్నారు.ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో గత 12 ఏళ్లలో 150 సార్లు పేపర్ లీకేజీలు జరిగాయని,కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేవలం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాత్రమే కాకుండా, శాంతిభద్రతల వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శి అందే మారుతి బాపూజీ,మెట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఇల్లెందుల రాజు,మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి కంబ సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



ప్రజాపక్షం /మెట్‌పల్లి : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మెట్‌పల్లి విద్యుత్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) మధుసూదన్ డిమాండ్ చేశారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం మెట్‌పల్లి డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈ మధుసూదన్ మాట్లాడుతూ, విద్యుత్ రంగం ప్రజలకు అత్యంత కీలకమైన సేవా రంగమని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగుల భద్రతతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యుత్ సంస్థలను లాభాపేక్షతో కాకుండా ప్రజా సేవా దృక్పథంతో నిర్వహించాల్సిన అవసరం ఉందని, విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ అజీజ్, మెట్‌పల్లి డివిజన్ జేఏసీ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, కార్యదర్శి హరి ప్రసాద్, జేఏసీ నాయకులు లక్మంపల్లి సురేష్,ఎండీ కరీం, శంకరయ్య, రవీందర్, భోయినపల్లి అశోక్, లక్ష్మీ, రాజమ్మ, మౌనిక, పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పనిలో రాహుల్ గాంధీ



ప్రజా పక్షం/సుల్తానాబాద్ : ప్రపంచంలోనే అతి పెద్దదైన ప్రజాస్వామ్య దేశంగా కీర్తించబడుతున్న భారతదేశ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నివాసాన్ని ముట్టడించే ప్రయత్నంతన అవివేకతనాన్ని తెలియజేస్తుందని బిజెపి సుల్తానాబాద్ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సుల్తానాబాద్ ఎలిగేడు అధ్యక్షులు కందుల శ్రీనివాస్,గాదె రంజిత్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు సొదరి మహేందర్ యాదవ్,జిల్లా కోశాధికారి కామని రాజేంద్రప్రసాద్, మన్ కీ బాత్ కన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్,మండల నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించి అంబేద్కర్ కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై నమ్మకం లేకనే రాహుల్ గాంధీ ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని పార్లమెంట్ నడుస్తున్న సందర్భంలో పార్లమెంట్ ఆవరణలో తన గళాన్ని వినిపించాల్సింది పోయి పిరికి పందలాగ యువతను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశంతో జాతి వ్యతిరేక శక్తులను కూడా కట్టుకొని ప్రపంచంలో భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అపరాధిగా చూపించే ప్రయత్నం చేశారని, జంతర్మంతర్లో క్రాక్రోస్ పార్టీ చేస్తున్నటువంటి నిరసన దీక్ష కేవలం నీట్ పరీక్ష అవకతవకలపై కాదని యావత్ భారతాన్ని విభజించే ప్రయత్నం అని జాతి వ్యతిరేక నినాదాలు,ఆర్టికల్ 370 పునరుద్ధరించాలని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కి కనీస అవగాహన లేకుండా తన నోటికి వచ్చినట్టు భారత ప్రధాని నరేంద్ర మోడీ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆకాశం వైపు ఉమ్మి వేయడం ఒక్కటేనని, తన పార్లమెంట్ పరిధిలో తన సొంత అనుచరులనే కాపాడుకోలేని చేతగాని దద్దమ్మని పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తన తండ్రి మంత్రి వివేక్ మరియు వంశీ అనుచరులను పోలీసులతో అలాగే తమ అనుచరులతో భౌతిక దాడులు చేపిస్తున్నప్పటికీ వారిని కాపాడుకోలేని వంశీ భారత ప్రధానిని విమర్శించడం తన పరిపక్వతలేమికి నిదర్శనం అని ఇంకోసారి తమ నాయకులు నరేంద్ర మోడీ ని విమర్శిస్తే పార్లమెంటులో పరిధిలో తిరగనివ్వమని హెచ్చరించారు.

# ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు కొనసాగిద్దాం




ప్రజాపక్షం /మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని ఎంఎస్ ఆర్ గార్డెన్స్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మెట్‌పల్లి పట్టణ శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ అధ్యక్షత వహించారు.ఈ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా. రాచకొండ యాదగిరి బాబు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. అనుప్ రావు,పూదరి అరుణ,జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి వేణు స్వరూప్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఆనంద్, బొడ్ల వసుధ నాగేష్, దొనికెల శిరీష నవీన్, కొయ్యల స్రవంతి లింగేశ్వర్, పుడుకారం కిషోర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. అనుప్ రావు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు కొనసాగిస్తూ బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు.అలాగే మెట్‌పల్లి పట్టణంలోని పలు సమస్యలపై రాజకీయ తీర్మానాలను ఆమోదించారు. పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టడం, సంక్షేమ గురుకుల హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం, ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు జుంగుల అనిల్ గౌడ్, కలికోట శ్రీకాంత్, బత్తుల జగదీష్, ఉపాధ్యక్షుడు లోలపు అనిల్, భోగ దత్తు, గుంటుక హనుమాన్లు, కొయ్యల లక్ష్మణ్, ఐటీ సెల్ కన్వీనర్ పాస్‌కంటి శ్రీనివాస్, సంకు ప్రసాద్, సంబోధి శ్రీధర్ చారి, వారిపెల్లి గంగాధర్, గుండు మోహన్, రాంపల్లి రఘుపతి ప్రభాకర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు గోపనవేని రమేష్ యాదవ్, భీమనాద్ విజయ్, గుండెవేని శేఖర్తో పాటు బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐదు లక్షల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : అర్హులైన వారు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్మించుకోవాలనే సదుద్దేశంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సొంత ఇంటి కల నెరవేరుతున్నది. రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయంతోనే లబ్ధిదారుల దశాబ్దాల కల సాకారమై వారి స్వగృహం సొంతమవుతున్నది. అద్దె భారం, ఇబ్బందులు దూరమై ఆ ఇందిరమ్మ ఇండ్లు ఆనందం, ఆత్మ గౌరవ ప్రతీకకు వేదికగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 3,470 ఇండ్లు పూర్తి కాగా, రూ. 216 కోట్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. అర్హులైన వారు సొంతిల్లు కట్టుకునేలా ఆర్థిక సాయం అందించి మద్దతుగా నిలవాలని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అర్హులు తమ సొంత స్థలంలోనే నిర్మించుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానించి.. ఇండ్ల నిర్మాణానికి దశల వారీగా మొత్తం రూ. ఐదు లక్షలు అందజేస్తుంది.

**వేగంగా ఇండ్ల నిర్మాణాలు..**

ప్రజా ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం పక్కా ప్రణాళిక ప్రకారం పథకాన్ని లబ్ధిదారులకు అందిస్తూ.. వారి ఇబ్బందులు దూరం చేస్తుంది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ.. అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ.. పనుల్లో వేగం పెరిగేలా మార్గ నిర్దేశం చేస్తున్నారు.

**రూ. 216 కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమ:** మొత్తం ఇండ్లు 7,367మంజూరు చేశారు. 5,932 ఇండ్లకు ముగ్గు పోశారు. బేస్ మెంట్ స్థాయిలో 5,138 ఉన్నాయి. గోడల స్థాయిలో 4,534 ఉండగా, 4,229 ఇండ్లు స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. 3,470 ఇండ్లు పూర్తి అయ్యాయి. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో మొత్తం 216 కోట్ల రూపాయలు నేరుగా జమ అయ్యాయి. ఇండ్లు పూర్తి అయి.. పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాలు పూర్తి అయ్యాయి.

**ప్రభుత్వ సహాయం.. సద్వినియోగం..**

జిల్లాలోని చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు తమ సొంత స్థలంలో ప్రజా ప్రభుత్వం విడతల వారీగా అందజేసిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని రూ. 5 లక్షలలోపే తమ సొంత ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకొని తమ దశాబ్దాల కలను నెరవేర్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంతో పడుతున్న ఇబ్బందులు, అద్దె భారాలు దూరమై స్వగృహ కల నెరవేరిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించిన సహాయం లోనే అధికారుల సూచనల మేరకు లబ్ధిదారులు ప్రతి పనికి ప్రణాళిక ప్రకారం డబ్బులు ఖర్చు చేసి ప్రభుత్వ ఆర్థిక సహాయంతోనే ఇండ్లను పూర్తి చేసుకోవడం మంచి పరిణామం.

**ఐదు లచ్చల ఇల్లు అయింది..**

మారుపాక నర్సవ్వ, కట్టలింగంపేట, చందుర్తి మండలం సొంత ఇల్లు లేక మస్తు కిరాయి ఇండ్లల్ల తిరిగినం. మాకు దేవునోలే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిరు. ఆల్లు ఇచ్చిన రూ. ఐదు లచ్చలల్లోనే ఇల్లు అయింది. కిరాయి బాధలు తప్పినయి. మాకు ఇల్లు ఇచ్చిన ఎమ్మెల్యే ఆది శ్రీన్నంకు, కలెక్టర్ మేడమ్ అగ్రవాల్ కు పది వేల దండాలు.

**ఇల్లు లేక చాలా ఇబ్బంది పద్దం**

పల్లికొండ మౌనిక, కట్టలింగంపేట, చందుర్తి మండలం నా పేరు పల్లికొండ మౌనిక. మేము సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పద్దం. అద్దె ఇంట్లో ఉండి కిరాయి చెల్లిస్తూ ఆర్థికంగా సమస్యలు ఎదురుకున్నాము. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి దరఖాస్తు చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ. 5 లక్షల్లోనే ఇల్లు కట్టుకున్నాం. ఆర్థిక సహాయం మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గారికి ధన్యవాదాలు.

# కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆసుపత్రి లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజా పక్షం/సుల్తానాబాద్ : భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ముందస్తుగా వేడుకలను నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తెలంగాణ టెక్నికల్ సర్వీస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేపట్టారు అనంతరం మాట్లాడుతూ. ఢిల్లీలో నీట్ విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జ్ కు వ్యతిరేకంగా సంబరాలు ఇంట్లో చేసుకోవడం కాదు ప్రజల కోసం చేసుకోవాలని ఇందిరాపార్క్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని కేటీఆర్ చేపట్టనున్నారన్నారు. ఢిల్లీలో విద్యార్థులు ధర్నా చేస్తుంటే ముందు నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు వచ్చారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాదులో ధర్నా చేసే ధైర్యం లేక ఎక్కడో మూలకు కొడంగల్ లో ధర్నా చేయడం సిగ్గుచేటు అన్నారు. కేంద్రం నీట్ ఎగ్జామ్ లో ఫెయిల్ అయిందని రాష్ట్రం గ్రూప్ ఎగ్జామ్ లో ఫెయిల్ అయిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పారుపల్లి గుణపతి, మాజీ ఎంపిటిసి శూర శ్యామ్, దయాకర్, సంపత్, గందే మల్లికార్జున్, రాకేష్, బండి సంపత్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నీట్ పరీక్షల వ్యవహారంలో విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జీని నిరసిస్తూ సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు లు మాట్లాడారు. నీట్ పరీక్షల లీకేజీ వ్యవహారంలో విద్యార్థులకు జరిగిన అన్యాయంపై దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, ప్రతిపక్ష నాయకులపై కేంద్ర బిజెపి ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జి చేయించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపైనే అణిచివేతకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన వంశీ అనే యువకుడు తన ఆత్మహత్యకు సంబంధించి రాసిన సూసైడ్ నోట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించిన అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు ప్రజల తరఫున ప్రశ్నిస్తుందని, ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆడెపు చంద్రకళ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, బొప్ప దేవయ్య, కౌన్సిలర్లు లింగంపల్లి గంగరాజు, బొద్దుల శ్రీనివాస్, కూరపాటి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో యువకుడు బలవన్మరణం..

ప్రజాపక్షం /ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లాలో తీవ్ర విషాదంతో పాటు రాజకీయ కలకలం రేపిన సంఘటన వెలుగుచూసింది. వివరాలలోకి వెళ్తే స్థానికంగా ఉన్న సమాచారం ప్రకారం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు (పిట్ల వంశీ ) ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చరవాణిలో ఇటీవల జరుగుతున్న దాడులు చూసి తీవ్ర మనస్తాపానికి పాల్పడ్డాడా అనే కోణంలో మరి కొంతమంది అనుమానిస్తున్నారు. "నా చావుకు ప్రధాని నరేంద్ర మోదీయే కారణం" అని సూసైడ్ నోట్‌లో రాయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు సైతం కేంద్ర తీరును తీవ్రంగా ఖండించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ చరవాణి ద్వారా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారికి కొండంత అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇక రాచర్ల గొల్లపల్లి గ్రామ పాలకవర్గం, గ్రామ యువత పెద్ద ఎత్తున తరలి వచ్చి యువకుడి అంతిమయాత్రలో పాల్గొని వీడ్కోలు పలికారు.

**కొండంత అండగాఆర్థిక సహాయం:** కేటీఆర్ ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ చేతుల మీదుగా 20వేల ఆర్థిక సహాయం ఉరి వేసుకున్న వ్యక్తి కుటుంబ సభ్యులకు తక్షణమే అందజేశారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.